
## ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

కంఠేశ్వర్/ డిచ్‌పల్లి, జూన్ 3: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లిలోని సీఎంసీలో ఓట్ల లెక్కింపు నిర్వహిసున్నట్లు పేర్కొన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు సైతం ఇక్కడే జరిగిందని, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్లను జగిత్యాలలో లెక్కించగా ఈసారి మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ సీఎంసీలోనే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బందిని అన్నివిధాలుగా సన్నద్ధం చేశామని పేర్కొన్నారు. 15రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు కౌంటింగ్ పూర్తయ్యే అవకాశం ఉన్నదని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఉదయం 6 గంటలకే కౌంటింగ్ సెంటర్ రావాలని, జారీ చేసిన ఎంట్రీపాసులతోపాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతిలేదని స్పష్టంచేశారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.



పార్టీ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా




సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

# నేడే ప్రజాతీర్పు

**ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు**

- డిచ్‌పల్లి సీఎంసీలో నిజామాబాద్ లోక్‌సభ ఓట్ల కౌంటింగ్
- గీతం యూనివర్సిటీలో 'జహీరాబాద్' లెక్కింపు
- ఓటు హక్కు వినియోగించుకున్న వారు 12, 26,133 మంది
- కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

నిజామాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఉత్కంఠ వీడనున్నది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. మే 13న జరిగిన పోలింగ్‌లో నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 17లక్షల 4వేల మంది ఓటర్లకు 12లక్షల 26వేల 133 మంది ఓటేశారు. ఎంపీగా ఎవరిని గెలిపించాలన్నది బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉన్నది.

**వీడనున్న ఉత్కంఠ...**

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, సర్వీస్ ఓట్లను ముందుగా లెక్కిస్తారు. ఈ ప్రక్రియ 8గంటలకు మొదలైతే గంటసేపట్లో ఫలితం వెల్లడవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ తర్వాత సర్వీస్ ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలో పూర్తికాకపోయినా 8.30గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించే అవకాశాలుంటాయి. అయితే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తయితే కానీ ఈవీఎంల రౌండ్ల ఫలితాలను అధికారికంగా ప్రకటించడానికి వీల్లేదు. సంబంధిత రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలోనే పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు టేబుళ్లకు అదనంగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఆర్వో వద్ద ప్రత్యేక టేబుల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపునకు నియోజకవర్గానికి 14 టేబుళ్లపై సహాయకులు పోలింగ్ కేంద్రాల ఈవీఎంలను క్రమపద్ధతిలో తీసుకొచ్చి ఉంచుతారు. సూపర్‌వైజర్ వాటిపై ఉండే రిజల్ట్ మీటను నొక్కి పార్టీల వారీగా పోల్ అయిన ఓట్లను నమోదు చేసుకుంటారు. మైక్రో అబ్జర్వర్ వాటిని పట్టికలో పొందుపర్చి ఆర్వోకు అందిస్తారు. అన్ని టేబుళ్ల లెక్కలను కలిపితే ఓ రౌండ్ ఫలితం వచ్చినట్లు పరిశీలన తర్వాత సంబంధిత ఆర్వో, పరిశీలకులు ఫలితాన్ని వెల్లడిస్తారు. చివరి రౌండ్ ఫలితం పూర్తయ్యాక అభ్యర్థి గెలుపును ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటిస్తుంది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా ఉన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గెలుపొందిన వ్యక్తికి ధృవీకరణ పత్రాన్ని అందిస్తారు.

**పకడ్బందీ ఏర్పాట్లు..**

డిచ్‌పల్లి, జూన్ 3: కౌంటింగ్‌ను పారదర్శకంగా చేపట్టేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఏజెంట్లను కేంద్రంలోకి అనుమతిస్తారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ పర్యవేక్షకుడు, సహాయకుడు, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. వీరిపై పర్యవేక్షణకు రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులతోపాటు ఈసీ నియమించిన పరిశీలకులు ఉంటారు. డిచ్‌పల్లి సీఎంసీ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాలుగు అంచెల భద్రత నడుమ కౌంటింగ్ చేపడుతున్నారు. ఉద్రిక్తతలకు చోటు లేకుండా 144 సెక్షన్ విధించారు.



సీఎంసీ వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



సీఎంసీలోని కౌంటింగ్ హాల్‌లో ఏరాటు చేసిన బారికెడ్లు

**రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడి..**

| అసెంబ్లీ నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | రౌండ్లు |
|---|---|---|
| ఆర్మూర్ | 217 | 16 |
| బోధన్ | 246 | 18 |
| నిజామాబాద్ అర్బన్ | 289 | 21 |
| నిజామాబాద్ రూరల్ | 293 | 21 |
| బాల్కొండ | 247 | 18 |
| కోరుట్ల | 262 | 19 |
| జగిత్యాల | 254 | 19 |

**నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల వివరాలు**

| అసెంబ్లీ నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓటు | పోలైన ఓట్ల శాతం |
|---|---|---|---|
| ఆర్మూర్ | 2,12,145 | 1,55,159 | 73.14 |
| బోధన్ | 2,23,096 | 1,66,330 | 74.56 |
| నిజామాబాద్ అర్బన్ | 3,04,317 | 1,88,159 | 61.83 |
| నిజామాబాద్ రూరల్ | 2,56,593 | 1,91,252 | 74.54 |
| బాల్కొండ | 2,26,792 | 1,69,524 | 74.75 |
| కోరుట్ల | 2,45,249 | 1,80,867 | 73.75 |
| జగిత్యాల | 2,36,675 | 1,74,842 | 73.87 |
| మొత్తం | 17,04,867 | 12,26,133 | 71.92 |




గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్

## జహీరాబాద్‌లో 23రౌండ్లు..

**గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి**

సంగారెడ్డి, జూన్ 3(నమస్తే తెలంగాణ) : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని గీతం యూనివర్సిటీలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొదట బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, ఆ తర్వాత ఈవీఎం ఓట్లను నియోజకవర్గాల వారీగా లెక్కిస్తారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ సోమవారం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఏడు నియోజకవర్గాలకుగాను ఏడు గదుల్లో 14 చొప్పున కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. కనిష్ఠంగా 19 రౌండ్ల నుంచి గరిష్ఠంగా 23 రౌండ్ల వరకు ఓట్లు లెక్కించనున్నారు.

**మొదట జుక్కల్, బాన్సువాడ ఫలితాలు**

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి 1973 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగగా 74.63 శాతం పోలింగ్ నమోదైంది. మొదట జుక్కల్, బాన్సువాడ ఎన్నికల ఫలితాలు వెలవడనున్నాయి.జుక్కల్‌లో 255 పోలింగ్ కేంద్రాలకు 14 కౌంటింగ్ టేబుళ్లు, 19 రౌండ్లు ఓట్లు లెక్కించనున్నారు. బాన్సువాడలోని 258 పోలింగ్ కేంద్రాలకుగాను 14 టేబుళ్లలో 19 రౌండ్లు ఓట్లు లెక్కిస్తారు. ఎల్లారెడ్డిలోని 270 పోలింగ్ కేంద్రాలకు 14 కౌంటింగ్ టేబుళ్ల ద్వారా 20 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. కామారెడ్డికి సంబంధించి 266 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లలో 19 రౌండ్లు ఓట్లు లెక్కించనున్నారు. నారాయణఖేడ్‌లోని 296 పోలింగ్ కేంద్రాలకు 14టేబుళ్లలో 22 రౌండ్లు, అందోల్‌లోని 313 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లలో 23రౌండ్లు, జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్ల ద్వారా 23 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నట్లు అధికారులు తెలిపారు.

## చిహ్నాల తొలగింపు ప్రజల్ని అవమానించడమే..

**మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, బిగాల**

కంఠేశ్వర్, జూన్ 3: ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన కాకతీయ కళాతోరణం, చార్మినార్ గుర్తులను తెలంగాణ రాజముద్ర నుంచి తొలగించడం రాష్ట్ర ప్రజల్ని అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల ముగింపు సందర్భంగా నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జాతీయ జెండా, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలను చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణ చరిత్ర ఆనవాళ్లు లేకుండా చేసేందుకు రాజముద్రను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎంకు రాజకీయంపై ఉన్న ప్రేమ.. పాలన మీద లేదని అన్నారు. పాలనపై ప్రేమ ఉంటే రైతుల గురించి ఆలోచించేవాడని, ఇప్పటి వరకు రైతుబంధు, భరోసా ఇవ్వకుండా రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలువబోతున్నదని అన్నారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, సిర్ప రాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, ఎనగందుల మురళి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ, బీఆర్ఎస్ జెండాల ఆవిష్కరణ అనంతరం నినాదాలు చేస్తున్న నేతలు

## కేసీఆర్ కృషితోనే తెలంగాణ అభివృద్ధి

**ప్రభుత్వ మాజీ విప్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్**

కామారెడ్డి, జూన్ 3: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల ముగింపు వేడుగలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా, గులాబీ జెండాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ మలి విడుత ఉద్యమంలో కేసీఆర్ నేతృత్వంలో పెద్దఎత్తున ఉద్యమం చేసి తెలంగాణను సాధించుకున్నామని అన్నారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విరక్తి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, కామారెడ్డి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, మాచారెడ్డి జడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపీగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు నల్లవెల్లి అశోక్, భూమేశ్ యా దవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే, ముజీబొద్దీన్, దఫేదార్ రాజు

## మంచం పట్టిన హన్మాజీపేట్

- కీళ్లనొప్పులు, సీజనల్ వ్యాధుల విజృంభన
- వారంపాటు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినా తగ్గని వ్యాధులు
- ఆందోళనలో గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, జూన్ 3: బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామస్తులు కీళ్లనొప్పులు, జ్వరాలతో మంచం పట్టారు. ఒకరిద్దరూ కాదు ఏకంగా వందలాది మంది ఈ వ్యాధులతో బాధపడుతున్నారు. ముఖ్యంగా గ్రామంలో ఒకటి, ఏడు, ఎనిమిది వార్డుల్లోని ప్రజలంతా జ్వరాలతో మంచానికే పరిమితమై.. నాణ్యమైన వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. తీవ్రమైన కీళ్లనొప్పులతో నడవడానికి, కూర్చోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు దవాఖానలో వైద్యానికి బాగా ఖర్చు చేశామని ఆవేదన వ్యక్తంచేశారు. హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. అయినా కూడా సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టలేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తపరీక్షలు, నాణ్యమైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కీళ్లవ్యాధితో మంచం పట్టిన వృద్ధుడు గొల్లపెద్ద గంగారాం



అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి

అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు పురం రాజు

### కీళ్ల నొప్పులు చాలా ఇబ్బందిపెట్టాయి..



నా కుమారుడు కీళ్లనొప్పులతో తీ వ్ర ఇబ్బందులకు గురయ్యాడు. నడవడానికి రాలేదు. నిజామాబా ద్ తీసుకెళ్లి వైద్యం చేయించాం. ఇప్పుడిప్పుడే కోలుకున్నాడు. గ్రామంలో వ్యాధులు ప్రబలడం ఆందోళన కలిగిస్తున్నది.

**- సాయిబాబా, హన్మాజీపేట్**

### ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశాం

గ్రామంలో చాలా మంది జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడ్డారు. ఈ విషయమై గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురావడంతో వారం రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందించాం. అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహించాం. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. మరోసారి శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందజేస్తాం.

**- సాయిలు, హెచ్ఈవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హన్మాజీపేట్**


నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం - మన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో అక్షర సమరం సాగించిన మన దినపత్రిక నమస్తే తెలంగాణ. బంగారు తెలంగాణ నిర్మాణంలోనూ తనదైన భూమికను పోషిస్తున్నది. ఇలాంటి చారిత్రక సందర్భంలో నమస్తే తెలంగాణ విలేకరిగా పని చేయాలనుందా..? అంకితభావంతో పాటు తెలుగుభాషా పరిజ్ఞానం, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నవారు పూర్తి బయోడేటాతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రాత పరీక్షకు హాజరు కాగలరు.

: పరీక్ష తేదీ :

తేది: 07.06.2024, శుక్రవారం ఉ॥ 11.30

స్థలం : నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, పోలీస్ బెటాలియన్ వెనుక, డిచ్‌పల్లి, నిజామాబాద్

నిజామాబాద్ జిల్లాలో..
- ఎల్లమ్మగుట్ట • ముబారక్‌నగర్
- అర్సపల్లి • మోపాల్ • జక్రాన్‌పల్లి
- కమ్మర్‌పల్లి • మెండోరా • సాలూరా

కామారెడ్డి జిల్లాలో..
- కలెక్టరేట్ • కామారెడ్డి టౌన్
- సదాశివనగర్ • లింగంపేట్ • తాడ్వాయి
- పిట్లం • బీర్కూర్ • పాల్వంచ

వివరాలకు : 9182777737, 9182777155